సాక్షి కామారెడ్డి

బుధవారం । 23 । ఆగస్టు । 2023



కార్యకర్తలే వెన్నెముక

బీజేపీకి బూత్ స్థాయి కార్యకర్తలు వెన్నెముక లాంటివారని ఆ పార్టీ అకల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి పేర్కొన్నారు.

- 11లో ▸



మంచి పేరు తేవాలి

పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు.

- 12లో ▸

గరిష్టం/కనిష్టం 34.1/23.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

తగ్గేదేలే..!



వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో అందరి దృష్టి ఈ నియోజకవర్గంపైనే కేంద్రీకృతమైంది. ప్రత్యర్థి పార్టీల నేతలు సైతం సవాల్‌ను స్వీకరిస్తున్నారు. పోటీకి తగ్గేదేలే అంటున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీతోపాటు బీజేపీ టికెట్టు ఆశిస్తున్న వెంకటరమణారెడ్డి సైతం గెలుపుపై ధీమాతో ఉన్నారు.

- కేసీఆర్ మీద పోటీకి సై అంటున్న ప్రత్యర్థులు
- కాంగ్రెస్ నుంచి షబ్బీర్‌అలీ, బీజేపీ నుంచి వెంకటరమణారెడ్డి సిద్ధం
- విజయం తమదేనంటూ ఇద్దరిలోనూ ధీమా

సాక్షి, కామారెడ్డి: వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో కామారెడ్డి నియోజకవర్గం ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారిపోయింది. సీఎం పోటీ చేస్తారని వెల్లడి కావడంతో ఆయనతో ఎవరు తలపడతారన్న దానిపైనా చర్చ మొదలైంది. సీఎం పోటీ చేస్తున్నారంటే మొత్తం వ్యవస్థ అంతా ఇక్కడే పనిచేస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయనను తట్టుకోగలరా అన్న విషయమై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రధాన ప్రత్యర్థులుగా భావిస్తున్న షబ్బీర్ అలీ, వెంకటరమణారెడ్డి మాత్రం వెనక్కి తగ్గబోమంటున్నారు. ప్రత్యర్థి సీఎం అని తెలిసినా ఇద్దరు నేతలూ నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. సీఎంను ఎదుర్కొనేందుకు రెండు పార్టీల నేతలూ సిద్ధం అవుతున్నారు.

గెలుపుడు పక్కా..

కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కయిన షబ్బీర్ అలీ.. సుదీర్ఘకాలంగా రాజకీయాలలో ఉన్నారు. పలుమార్లు పోటీ చేసిన ఆయన.. రెండుసార్లు గెలిచి మంత్రిగానూ పనిచేశారు. ఎన్నికలలో ఓడిపోయినా ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఊళ్లన్నీ చుట్టేసిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ.. తాను నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, కామారెడ్డి ప్రజల ఆశీర్వాదం వల్లే రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అయ్యాయని పేర్కొంటున్నారు. ప్రజలతోనే ఉంటానని, వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఈసారి తాను గెలుస్తానంటున్నారు.

జనంలో ఆసక్తి

సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తారన్న ప్రకటనతో నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. ఇన్నాళ్లు అధికార పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పోటీ చేస్తారని, ఆయనకు ప్రత్యర్థులుగా కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బీజేపీ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి బరిలో నిలుస్తారని, త్రిముఖ పోరు జరుగుతుందని భావించారు. అయితే గంప గోవర్ధన్ స్థానంలో సీఎం పోటీ చేస్తారని వెల్లడి కావడంతో రాజకీయ సమీకరణలు మారుతాయని భావిస్తున్నారు. కేసీఆర్‌తో పోటీని ప్రత్యర్థులు ఎలా తీసుకుంటారు, ఏ మేరకు తట్టుకుంటారన్న దానిపై చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ నేతలు కామారెడ్డిలో తిష్ట వేస్తారని, ప్రత్యర్థి పార్టీల్లోని క్యాడర్‌పై వల విసురుతారని చర్చ నడుస్తోంది. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో రాజకీయాలు మరింత రసవత్తరంగా మారబోతున్నాయి.

ప్రత్యర్థి ఎవరైనా..

కామారెడ్డినుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న బీజేపీ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి.. నిత్యం జనంలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల వారీగా పర్యటిస్తూ కుల సంఘాల భవనాలు, కుల దేవతల ఆలయాల నిర్మాణాలకు భారీగా నిధులు ఇస్తూ వస్తున్నారు. నాలుగు వందలకుపైగా కుల సంఘాలకు సాయం అందించారు. ప్రత్యర్థి ఎవరైనా పోటీ చేసుడు పక్కా అని ఆయన పేర్కొంటున్నారు. బీజేపీ నుంచి బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తన సేవలను గుర్తించి ప్రజలు.. అసెంబ్లీకి పంపిస్తారన్న నమ్మకంతో ఉన్నారు.

మళ్లీ గెలిచి చరిత్ర సృష్టిస్తా



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తా
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: గతంలో స్పీకర్‌గా చేసిన వారు ఓడిపోతారన్న అపోహ ఉందని, ఈసారి తాను బాన్సువాడలో విజయం సాధించి చరిత్ర సృష్టిస్తానని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ బీఆర్ఎస్ టికెట్‌ను తనకు కేటాయించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు ఎవరూ సాటిలేరని, బీఆర్ఎస్ పార్టీకి ఏ పార్టీ పోటీ కాదని పేర్కొన్నారు. ఇతర పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదన్నారు. బీఆర్ఎస్ మాత్రం నాలుగు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించిందని పేర్కొన్నారు. 2014లో బీఆర్ఎస్ 63 స్థానాలు గెలిచిందన్నారు. గత ఎన్నికలలో బలాన్ని 83కు పెంచుకున్నామని పేర్కొన్నారు. ఈసారి 103 స్థానాలు గెలవడం ఖాయమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో రూ.11 వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఒక్క బాన్సువాడ మున్సిపాలిటీనే రూ.650 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు హామీల్లో ఒక్కదానినీ అమలు చేయడం లేదని, ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దేవుడెరుగు ఉన్న బస్సుల్లో డీజిల్ లేక బస్సులు బంద్ చేశారని విమర్శించారు.

బీసీ గురుకుల బాలికల కళాశాల మంజూరు

బాన్సువాడకు బీసీ గురుకుల బాలికల కళాశాల మంజూరైందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయన్నారు. బాన్సువాడ పట్టణానికి దగ్గరగా కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, అవారి గంగారాం, శశికాంత్, దుంపల రాజు, ద్రోణవల్లి అశోక్, సాయిలు, వాహబ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

‘సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి’



కామారెడ్డి క్రైం: గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను రైస్ మిల్లర్లు వచ్చేనెలాఖరులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రైస్‌మిల్ యజమానులతో ఆయన సీఎంఆర్ మిల్లింగ్ లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్‌ను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున బాబు, ఏఎస్‌వో నిత్యానందం, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో ప్రతిభ



దోమకొండ : రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో దోమకొండకు చెందిన సింధూజ మొదటి స్థానంలో నిలిచి ప్రశంసాపత్రంతో పాటు రూ.3 వేల నగదును అందుకుంది. మిక్స్‌డ్ విభాగంలో సింధూజ, అనుదీప్ ద్వితీయ స్థానంలో నిలిచి, ప్రశంసాపత్రంతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతి అందుకున్నారు. క్రీడాకారులను జాతీయ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామినేని అనిల్ కుమార్, జిల్లా అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్ గౌడ్, అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తదితరులు అభినందించారు.

23 నుంచి స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ: గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఈనెల 23 నుంచి 28 వరకు ఇంటర్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని గిరిజన బాలుర కళాశాల బాన్సువాడ ప్రాంతీయ సమన్వయకర్త సంపత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హన్మాజీపేట్ –కోనాపూర్‌కు మంజురైన గిరిజన గురుకుల బాలికల కళాశాలకు ఈ విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2023లో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మెమో, టీసీ, బోనఫైడ్, కులం, ఆదాయం, నివాస, ఫిజికల్ ఫిట్‌నెస్, 8 ఫొటోలు తీసుకుని స్పాట్ అడ్మిషన్లకు రావాలని సూచించారు. ఎస్టీ బాలికలతో పాటు ఓసీ, బీసీ విద్యార్థునులకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. 23 వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర కళాశాలలోనూ స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు.

సీనియర్ ఓటర్లను ఆదర్శంగా తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: సీనియర్ ఓటర్లను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో 90 ఏళ్లు నిండిన సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిచంఆరు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కాలనీలోగల యోగా కేంద్రంలో మంగళవారం యోగాసన పోటీలు నిర్వహించారు. పోటీలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జూనియర్, సబ్ జూనియర్ బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు గరిపల్లి అంజయ్య, పెట్టిగాడి అంజయ్య పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం సౌత్‌క్యాంపస్‌ను సందర్శించి, సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు మోహన్ బాబు, నాగరాజు, విద్యార్థి నేతలు ప్రసాద్, రమేష్, బాబు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ ఫ్రీ జిల్లాగా కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: మాన్యువల్ స్కావెంజర్ ఫ్రీ జిల్లాగా కామారెడ్డిని ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టంపైన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు మరుగుదొడ్డిలోకి దిగి మానవ విసర్జితాలను చేతులతో తొలగించవద్దన్నారు. సెప్టిక్ ట్యాంక్ లేకుండా ఎవరైనా మరుగుదొడ్లు నిర్మించుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్కావెంజర్ నిషేధిత చట్టంపై మున్సిపాలిటీ స్థాయిలో కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, డీపీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్లు రమేష్ కుమార్, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఓటమి భయం

- అందుకే రెండుచోట్ల నుంచి పోటీ
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్) : సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లారోడ్డులోగల ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్, కామారెడ్డిలు అతి సమీపంలో ఉన్న నియోజకవర్గాలన్న విషయం కేసీఆర్‌కు తెలుసన్నారు. ఉత్తర తెలంగాణలో మరోస్థానంనుంచి పోటీ చేయాలనుకుంటే ఆర్మూర్ లేదా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని సీఎంకు సూచించారు. కేసీఆర్ అభద్రతాభావంతో ఉన్నారని, అందుకే రెండుచోట్ల నుంచి పోటీకి సిద్ధం అయ్యారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో ఆయన ఓడిపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో మైనారిటీలకు ఒరిగిందేమీ లేదని, వారిని గుర్తించింది బీజేపీనేని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశంలో 3.5 కోట్ల ఇళ్లిచ్చామని, 70 శాతం ముస్లిం మహిళలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకం కాదని, దీనిని నిరూపించేందుకు అవకాశం ఇవ్వాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంతు చిక్కని శిశుమరణాలు

నెల రోజుల్లో ఏడుగురి మృతి

- అందరూ 4 నెలలలోపు చిన్నారులే
- దగ్గు, దమ్ముతో బాధపడుతున్న పిల్లలు
- వైద్యులు పరీక్షిస్తుండగానే ఆగిపోతున్న ఊపిరి
- ఆందోళనలో వైద్యులు, తల్లిదండ్రులు
- రాష్ట్ర అధికారులకు సమచారమిచ్చిన వైద్యులు



తన బిడ్డను కాపాడాలని చేతులు జోడించి వేడుకుంటున్న తల్లి

కామారెడ్డి టౌన్: జిల్లాలో శిశు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దగ్గు, దమ్ము, శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రులలో చేరుతున్న చిన్నారులలో నెలరోజుల్లో ఏడుగురు మృత్యువాతపడ్డారు. దీంతో తల్లిదండ్రులతోపాటు వైద్యులూ ఆందోళన చెందుతున్నారు.

ఇటీవలి కాలంలో చిన్నారులలో దగ్గు, దమ్ము సమస్యలు తలెత్తుతున్నాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో పలువురు తమ పిల్లలను జిల్లాకేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో అత్యాధునిక పరికరాలతో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అక్కడి వైద్యులు పరీక్షించలోపే గేటు బయట ఒకరు, ఓపీ విభాగంలో మరొకరు, ఐసీయూలో వెంటిలేటర్‌పై ముగ్గురు, హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఇద్దరు.. ఇలా నెలలో ఏడుగురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. వీరంతా మూడు నుంచి నాలుగు నెలల మధ్య వయసు గలవారే..

లక్షణాలివి..

చిన్నారులకు మొదట దగ్గు వస్తోంది. ఆపై దమ్ముతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతోంది. పిల్లలు తీవ్రంగా ఏడుస్తున్నారు. శరీరం చల్లబడడం, తల వేడిగా మారడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. చిన్నారులు గుక్కపట్టి ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రులకు వస్తున్నారు.

వైద్యులకూ అంతుచిక్కని సమస్య

ఆయా సమస్యలతో బాధపడుతున్న పిల్లలను వారి కుటుంబ సభ్యులు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రులకు తీసుకువస్తున్నారు. టుడీ ఎకో స్కానింగ్ చేస్తే గుండె కుడి భాగం వైపు ఫెయిల్యూర్, ఊపిరితిత్తుల్లో సమస్య ఉన్నట్లుగా తెలుస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో ఇలాంటి లక్షణాలతో వచ్చినవారికి సకాలంలో వైద్యం అందించి బతికించామని పేర్కొంటున్నారు. అయితే ఇటీవల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, దీనికి కారణాలు తెలియడం లేదని వారంటున్నారు.

ఈ విషయమై రాష్ట్ర వైద్య అధికారులకు, డీఎంహెచ్‌వోలకు సమాచారం ఇచ్చామంటున్నారు. పిల్లలలో కనిపించిన లక్షణాలు, అందించిన చికిత్సను వీడియోతో సహా పంపించినట్లు తెలిసింది.

వైద్యం అందించేలోపే..



శిశువులలో దగ్గు, దమ్ము, తీవ్ర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల వైద్యం అందించేలోపే ఏడుగురు మరణించారు. ఈ ఏడు కేసులు వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి మా వద్దకు వచ్చాయి. వైద్యం అందించేలోపే మరణించారు. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎప్పుడూ చూడలేదు. దీనిపై జిల్లా, రాష్ట్ర అధికారులకు సమాచారం ఇచ్చాం. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి.

– విజయ్‌రాజ్, చిన్నపిల్లల వైద్యుడు, కామారెడ్డి

విత్తనక్షేత్రంలో వెనకబడిన సాగు

- 20 ఎకరాలలో వరి, 30 ఎకరాలలో కంది సాగుకు ప్రణాళికలు
- ఇప్పటికీ ప్రారంభంకాని వరినాట్లు



మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో సిద్ధం చేసిన వరినారు

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రం పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచిపోయినా ఇప్పటికీ నాట్లు పడలేదు. పుష్కలంగా నీరున్నా.. పంటల సాగులో వెనకబడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలో వందల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ భూమిని సాగు చేసేందుకు పుష్కలంగా నీరు కూడా అందుబాటులో ఉంది. అయినా ఈ ఖరీఫ్ సీజన్‌లో 20 ఎకరాలలో వరి, 30 ఎకరాలలో కంది సాగుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అవసరమైన నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ వరినాట్లతోపాటు కంది సాగు కూడా ప్రారంభం కాలేదు. గ్రామాలలో రైతులు నెలరోజుల క్రితమే వరినాట్లను పూర్తిచేసుకోగా.. విత్తనక్షేత్రంలో మాత్రం నేటికీ వరినాట్లను ప్రారంభించకపోవడం గమనార్హం. ఇటు వరినాట్లు ప్రారంభంకాక, అటు కందిసాగు చేపట్టకపోవడంతో విత్తనక్షేత్రంలోని సాగుభూములు బీడుగా మిగిలిపోయాయి.

అనుమతులు రాక ఆలస్యం?

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి సకాలంలో అనుమతులు రాకపోవడం వల్లే ఈయేడు పంటలసాగు ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనక్షేత్రంలో కంది సాగుచేయడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కందిసాగుకు జూన్, జులైలలో పరిస్థితులు అనుకూలంగా ఉండేవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గత రబీసీజన్‌లోనూ విత్తనక్షేత్రంలో లక్షల రూపాయలు వెచ్చించి సాగుచేసిన పత్తిపంటలో సరైన దిగుబడి రాక తీవ్రనష్టం వాటిల్లింది. ప్రస్తుత పరిస్థితుల్లో కందిపంట సాగుచేస్తే నష్టం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అరకొర సిబ్బంది...

మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గతంలో వందల ఎకరాలలో పంటలను సాగు చేయగా ప్రస్తుతం పంటలసాగు విస్తీర్ణం పదులసంఖ్యకు పడిపోయింది. విత్తనక్షేత్ర ఏడీఏ వీరాస్వామి గతనెల 25 నుంచి వచ్చేనెల 25 వరకు సెలవు పెట్టారు. దీంతో జిల్లాలోని నస్రుల్లాబాద్ విత్తనక్షేత్ర ఏడీఏ అనిల్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. విత్తనక్షేత్రంలో ఏవో హరివెంకటప్రసాద్ నెలలుగా సెలవులో ఉన్నారు. ఏఈవో నాగరాజు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్స్ చదివేందుకు నాలుగేళ్ల క్రితం వెళ్లారు. వాచ్‌మన్ సాయిలును రెండు నెలల క్రితం డిప్యుటేషన్‌పై బిచ్కుంద ఏడీఏ కార్యాలయానికి పంపించారు. ప్రస్తుతం ఏఈవో శ్యాం సుందర్‌రెడ్డి, ట్రాక్టర్ క్లీనర్ సంతోష్, అటెండర్ కాశీరాం, గోదాం సూపరింటెండెంట్ సాయికుమార్ మాత్రమే విత్తనక్షేత్రంలో విధులు నిర్వహిస్తున్నారు. విత్తన క్షేత్రంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో వందల ఎకరాల సాగుభూములు బీడుగా ఉంచాల్సిన పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని, సకాలంలో పంటలు సాగు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



కందిసాగుకోసం దున్నిన భూమి



విత్తనక్షేత్రంలో బీడుగా ఉన్న భూమి

క్లుప్తంగా

బీసీ సంఘానికి స్థలం కేటాయించాలని వినతి



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలో బీసీ సంఘ భవనం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు బీసీ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివ రాములు నేత, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మారోజు మోహనచారి, ప్రధానకార్యదర్శి పెద్దోళ్ల మహేష్, అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాని బాన్సువాడ డిపో కార్గో ఇన్‌చార్జి ఇర్ఫాన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టి–సేవ కేంద్రంలో టీఎస్‌ఆర్టీసీ కార్గో సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ డిపో పరిధిలో బాన్సువాడ, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, దోంగ్లీ మండలాల్లో ఇప్పటికే కార్గో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో కూడా కార్గో సేవలు ప్రారంభించామన్నారు. కౌంటర్ ఏజెంట్ హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్తా



రాజంపేట: కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసనాల ఛాంపియన్‌షిప్‌లో శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో సత్తాచాటారు. సబ్ జూనియర్స్ విభాగంలో సంపత్ మొదటి స్థానంలో నిలవగా అంకిత్ ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా యోగా అధ్యక్షుడు రామిరెడ్డి విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముదాం స్వామి, యోగా టీచర్ నాగజ్యోతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలకు 45 మంది విద్యార్థులకు 39 మంది, మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 51 మంది విద్యార్థులకు 47 మంది హాజరైనట్లు తెలిపారు.

లక్ష్యం చేరుకునేనా!

- ఎస్సారెస్పీలో పూర్తిస్థాయిలో జరగని విద్యుత్ ఉత్పత్తి
- గరిష్టంగా ఒక్కరోజు 35.7 మెగావాట్ల తయారీ
- ఈ ఏడాది టార్గెట్ 60 మిలియన్ యూనిట్లు
- ఇప్పటి వరకు 15 మిలియన్ యూనిట్ల కరెంట్ ఉత్పత్తి



జల విద్యుత్ కేంద్రంలోని టర్బయిన్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గల జల విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. ప్రాజెక్ట్ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు గోదావరి పాలైన పూర్తి స్థాయిలో కరెంట్ ఉత్పత్తి చేయలేదు. కేంద్రంలో నాలుగు టర్బయిన్‌లు ఉన్నాయి. ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల చొప్పున 4 టర్బయన్ల ద్వారా 36 మెగావాట్లు తయారు చేయవచ్చు. కానీ ప్రస్తుత సంవత్సరం ఒక్కరోజు కూడా పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగలేదు. గరిష్టంగా ఒకరోజు మాత్రమే 35.7 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగలంటే 2200 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపడితేనే కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుంది. కానీ కాకతీయ కాలువకు నీటి అవసరం లేకుండా క్రాస్ రెగ్యులేటర్‌ను దించి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని మళ్లించి ఉత్పత్తి చేపట్ట వచ్చు. అదే విధంగా ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8 వేల క్యూసెక్కుల నీటిని వదిలి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు.

లక్షల క్యూసెక్కులు గోదావరి పాలైనా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద పెరిగినప్పుడు లక్షల క్యూసెక్కులనీటిని గోదావరిలోకి వదిలారు. గరిష్టంగా 3.5 లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కానీ 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టలేదు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు వదిలిన అధికారులు, కాకతీయ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు వదిలిన పూర్తి స్థాయిలో లోడ్‌పెడితే 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే అవకాశం ఉండేది. కానీ నాలుగు రోజుల క్రితం గరిష్టంగా 35.7 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి అయింది. గోదావరిలోకి నీటిని వదిలిన సమయంలోనూ 34 మెగావాట్లు దాటలేదు. దీంతో ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరుకోవడం కష్టంగా కనిపిస్తుంది. మొత్తం 75 మిలియన్ యూనిట్లు(ఎం.యూ) లక్ష్యం కాగా ఇప్పటి వరకు 15.18 మిలియన్ యూనిట్ల కరెంట్ తయారు అయింది. గతేడాది ఈ సమయానికి 37.5 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. గతేడాది లక్ష్యం 75 ఎం.యూ కాగా మొత్తంగా 139 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. గతేడాది ఒక టర్బయిన్‌లో వైబ్రేషన్ రావడంతో ప్రస్తుతం పూర్తిస్థాయిలో లోడ్ పెట్టడం లేదని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో రెండు టర్బయిన్‌ల ద్వారా 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వీవోఏ ఇల్లు ముట్టడించిన మహిళలు



వీవోఏ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

- వంటా వార్పుతో నిరసన
- తమ డబ్బులు చెల్లించాలని డిమాండ్

నిజాంసాగర్: స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల కిస్తీలు చెల్లించిన డబ్బుల కోసం స్వయం సహాయక సంఘాల మహిళలు పోరుబాట పట్టారు. నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో మంగళవారం మహిళలు వీవోఏ స్వప్న ఇంటిని ముట్టడించారు. గ్రామంలోని 11 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి పొదుపు డబ్బులు రూ.26 లక్షలను బీసీ పాయింట్ నిర్వాహకులు గోల్‌మాల్ చేశారు. ప్రతి నెల స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ డబ్బులు బీసీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లిస్తుంటారు. కానీ పొదుపు డబ్బులు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా బీసీ పాయింట్ నిర్వాహకులు పక్కదారి పట్టించారు. బీసీ పాయింట్‌కు చెల్లించిన కిస్తీలు, వాటి రసీదులు చేతపట్టుకొని ఐదారు నెలల కింద మహిళలు ఐకేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. విషయం తెలుసుకున్న ఐకేపీ అధికారులు, స్టేట్ బ్యాంకు అధికారులు బీసీ పాయింట్ నిర్వాహకురాలిపై విచారణ చేపట్టారు.

మహిళలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ స్వాహా అయిన డబ్బులు మహిళలకు చేరకపోవడంతో పలు మార్లు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. దాంతో మండల నాయకులు జోక్యం చేసుకొని డబ్బులు ఇప్పించే ప్రయత్నం చేశారు. అయినా సమస్య కొలిక్కి రాకపోవడంతో మహిళలు హసన్‌పల్లి గ్రామంలోని వీవోఏ ఇంటిని ముట్టడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు వీవోఏ ఇంటి వద్ద కూర్చొని అక్కడే వంటా వార్పు చేశారు. రాత్రి కూడా అక్కడే బస చేయనున్నట్లు తెలిపారు. తమకు డబ్బులు చెల్లించే వరకు పోరాటం చేస్తామని మహిళలు తెలిపారు.

పూసల కులస్తులను ఎంబీసీలో చేర్చండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పూసల కులస్తులు

కామారెడ్డి రూరల్: పూసల కులస్తులను ఎంబీసీ, డీఎన్‌సీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూసల కులస్తుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంట శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పూసల కులం సంచార జాతిలో ఒక రకానికి చెందినది, సమాజంలో తమకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సంచార కులస్తులకు ఎలాంటి సహకారం అందించలేదని, బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి సహకారం అందలేదని తెలిపారు. పూసల కులస్తులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, బీసీ బంధు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ముద్ర కోళ్ల శ్రీశైలం, పట్టణ కోశాధికారి పసులోడి శోభ, జిల్లా అధ్యక్షులు ముద్ర కోళ్ల లింబాద్రి పాల్గొన్నారు.

పోలీసులకు అనుమానితుల అప్పగింత

నందిపేట్: మండలంలోని బాద్గుణ గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురిని పట్టుకొని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం నలుగురు ఆడవారి వేషంలో, ఇద్దరు మగవారు కలిసి గ్రామంలో తిరుగుతుండగా అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని పిలిచి ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు గ్రామస్తులకు ఎదురు మాట్లాడటంతో వారిని పట్టుకొని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. వారి వద్ద వెతుకగా మత్తు పదార్థాలతో పాటు గోళీలు, కల్తీ కల్లు కనిపించాయి. దీంతో గ్రామస్తులు వారిని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడి నియామకం



భిక్కనూరు: కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా భిక్కనూరుకు చెందిన జేపీ వెంకటేశ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను మాజీ మంత్రి షబ్బీర్ అలీ మంగళవారం ఆయనకు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో కాంగ్రెస్ ఆశయాలను పెంపొందించాలని షబ్బీర్ అలీ సూచించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఐటీ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్నికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరు



ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

వర్ని: వర్నికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరైనట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్నిలో రూ.70 లక్షలతో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్‌ను మంగళవారం స్పీకర్ ప్రారంభించారు. ఎనిమిది కోర్సులతో డిగ్రీ కళాశాల మంజూరు అయిందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 100 జనరల్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతుంటే ప్రతిపక్షాలు పనులను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో ప్రతిపక్షాల వారు ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని, కాంగ్రెస్ హయాంలో నిర్మించామని చెప్పుకుంటున్న ఇండ్లు ఎక్కడున్నాయని వాటి నిధులు ఎక్కడికి పోయాయని ప్రజలు నిలదీయాలని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వర్ని జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, బాలరాజు, కరీం, సొసైటీ అధ్యక్షుడు సాయిబాబా, కృష్ణారెడ్డి, సర్పంచులు రాజు, కన్నీరం వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి కలిసిన యూత్ కాంగ్రెస్ నేతలు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. కామారెడ్డి నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. మాజీమంత్రి షబ్బీర్ అలీని కామారెడ్డిలో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు, నాయకులు గంప ప్రసాద్, కడెం ప్రవీణ్, శేఖర్, నవీన్, రాజ శేఖర్, సర్వర్‌లు పాల్గొన్నారు.

లైఫ్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న తిరుపతి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని లైఫ్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం నవ తెలంగాణ రామారెడ్డి విలేకరి తిరుపతి మంగళవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. తాను నాలుగు నెలల క్రితం పంట పొలంలో జారి పడితే చేతి మణికట్టు విరిగిపోతే అపరేషన్ సరిగ్గా చేయకుండా విరిగిన ఎముకను తొలగించకుండా మళ్లీ ఆపరేషన్ అయ్యేలా చేశారని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఆస్పత్రిలో దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. అర్హత లేని వైద్యుడితో ఆపరేషన్ చేయించారని తెలిపారు. వైద్యుడి వివరాలు తెలపడం లేదన్నారు. ఈ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని, తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రెగ్యులరైజ్ చేయకుంటే ఉద్యమం తీవ్రం చేస్తాం

- కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా



భిక్కనూరు: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున్న ఉద్యమం చేస్తామని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. మంగళవారం ఆయన తెయూ సౌత్ క్యాంపస్‌లో మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చి ఇప్పటి వరకు హామీని నిలబెట్టుకోకపోవడం శోచనీయమన్నారు. 90 రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, రమాదేవి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మొబైల్ షాప్‌లో చోరీ



పెద్దకొడప్‌గల్: పెద్దకొడప్‌గల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న సోను–మోను మొబైల్ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం తాళాలు పగులగొట్టిన దొంగలు సుమారు రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంకట్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

కూరగాయల షాపులో..

రుద్రూర్: రుద్రూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న కూరగాయల దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు కళావతి మాట్లాడుతూ కూరగాయలు విక్రయించి కుటుంబాన్ని పోషించుకునే తమపై ఎవరో కక్ష కట్టి చోరీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే షాపులో రెండు సార్లు దొంగలు చొరబడి నగదు, కూరగాయలు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం సైతం నగదు, కూరగాయలు పోయినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

జూనియర్ కళాశాలలో..

గాంధారి: గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. కళాశాలలో నుంచి కంప్యూటర్‌ను అపహరించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

ఖలీల్‌వాడి: ఆస్పత్రులకు వచ్చిన వారి దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న మహిళను అరెస్టు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌కు చెందిన సమ్రీస్ బేగం నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రులకు ఇతర గ్రామాల నుంచి వచ్చే వారి వద్ద చోరీలు చేసేది. వారి దృష్టి మరల్చి బ్యాగులో ఉన్న డబ్బులు, బంగారం ఎత్తుకెళ్లేది. మార్చ్16న వైష్ణవి ఆస్పత్రిలో ఇలాగే చోరీ చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మేనమామ శ్రీనివాస్‌ను కత్తితో పొడిచిన పోలు రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. పోలు రాజును కామారెడ్డి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



ముదాం చందు(ఫైల్)

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని 27వ వార్డుకు చెందిన ముదాంగల్లిలో గల ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదిలో ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ నరేష్ తెలిపారు. వివరాలు.. ముదాంగల్లికి చెందిన ముదాం చందు(33) కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాలతో ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కొన్ని రోజులుగా చందు ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మృతుడి భార్య పిల్లలను తీసుకుని రెండు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన చందు పాఠశాలలోని గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాల అటెండర్ ఆ గది తలుపులు తీయగా పూర్తిగా కాలిపోయిన స్థితిలో మృతదేహం ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేసి మృతదేహం చందుదిగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

ఎల్లారెడ్డి: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన మైలారం సాయిలు(45) సోమవారం ఎల్లారెడ్డికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిలో వెతకగా పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్ మృతదేహం కనిపించింది. అనారోగ్యానికి గురి కావడంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

మోపాల్: మోపాల్‌లోని ఓ కోళ్లఫారంలో కూలీ పని చేస్తున్న మురీష్(41) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబా(కె) గ్రామానికి చెందిన మురీష్ వారం క్రితం సహజీవనం చేస్తున్న లక్ష్మితో కలిసి పనిలో చేరాడు. మురీష్ తాగుడుకు బానిసై సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో లక్ష్మి కుటుంబ సభ్యులతో చెప్పడంతో వారు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై కోళ్లఫారంలోనే ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో రావుట్లవాసులకు గాయాలు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

సిరికొండ: ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలవడానికి హైదరాబాద్ వెళ్తుండగా మెదక్ జిల్లా చేగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రావుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. బాజిరెడ్డికి టికెట్ రావడంతో గ్రామానికి చెందిన పలువురు రెండు కార్లలో మంగళవారం వేకువజామునే హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. మార్గమధ్యంలో చేగుంట వద్ద పట్టణంలో నుంచి హైవే పైకి వస్తున్న కోళ్ల వ్యాను వీరు ప్రయాణిస్తున్న ఒక కారును బలంగా ఢీకొనడంతో ప్రమాదం నెలకొంది. ఆ కారులో ప్రయాణిస్తున్న తోట రాజన్న, నత్తి భూమయ్య, నడుకుడ రెడ్డి, ప్యాట్ల అశోక్, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే దగ్గర ఉండి క్షతగాత్రులకు చికిత్స చేయించారు. తాను అన్ని విధాలా అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నిమ్మగడ్డ సత్యనారాయణతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని, ఖర్చులు తానే భరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

బైక్‌పై నుంచి పడి ఒకరు..

పిట్లం: పిట్లంలోని రాజస్థాన్ దాబా సమీపంలో మంగళవారం జాతీయ రహదారి పక్కన వద్ద విజయ్ బైక్ అదుపు తప్పి పడిపోయాడు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన విజయ్ బైక్‌పై పిట్లం నుంచి నర్సింగ్‌రావ్‌పల్లి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. రోడ్డు పక్కన గుంతల్లో పడడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు హైవే సిబ్బందికు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



కిషన్ (ఫైల్)

సదాశివనగర్: సదాశివనగర్ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. మద్నూర్ మండలం పెద్దఏక్లర గ్రామానికి చెందిన చిక్కల్వార్ కిషన్(57) కొన్ని రోజులుగా సదాశివనగర్ శివారు మల్లుపేట్ బ్రిడ్జి వద్ద గల తాజ్ హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి సదాశివనగర్ నుంచి దాబాకు రోడ్డు వెంబడి నడుచుకుంటు వస్తుండగా నిజామాబాద్ వైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహంపై నుంచి ఇతర వాహనాలు వెళ్లడంతో ముక్కలయింది. గుర్తించడానికి ఆనవాళ్లు లేకుండా పోయింది. మృతుడు ధరించిన చెప్పుల ఆధారంగా దాబాలో పని చేసే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.